పట్టభద్రుల ఎమ్మెల్సీ

బీజేపీ అభ్యర్థిగా అంజిరెడ్డి

ఖరారు చేసిన అధిష్టానం

రెండు దశాబ్దాలుగా ఎస్ఆర్ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు



7

గురుకులాల్లో ప్రవేశాలకు

దరఖాస్తుల ఆహ్వానం

● కలెక్టర్ మనుచౌదరి



సిద్దిపేట కలెక్టరేట్ జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గురుకుల విద్యాలయాల్లో చేరి విద్యావంతులవ్వాలని కలెక్టర్ మను చౌదరి అన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల విద్యాసంస్థల్లో 5వ తరగతి ప్రవేశాలు, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6 నుంచి 9 తరగతుల్లో ఖాళీల ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. టీజీఎస్‌డబ్ల్యూఈఆర్ఐఎస్ గౌలిదొడ్డి, అలుగునూరు సీవోఈలలో 9వ తరగతి ప్రవేశాలు, టీజీటీడబ్ల్యూఈఆర్ఐఎస్ ఖమ్మం, పరిగి సీవోఈలలో 8వ తరగతి ప్రవేశాలు, టీజీఎస్‌డబ్ల్యూఈఆర్ఐఎస్ రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజ్‌గిరి ఫైన్ ఆర్ట్స్ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశాలకు 2025-26 విద్యా సంవత్సరానికి గాను కామన్ ప్రవేశ పరీక్షకు (ఇంగ్లీషు మీడియం) జిల్లా నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. దరఖాస్తులను వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే సమర్పించాలన్నారు. దరఖాస్తుల సమర్పణకు ఫిబ్రవరి 1 చివరి తేదీ అని, ఫిబ్రవరి 23న ప్రవేశపరీక్ష ఉంటుందని తెలిపారు. సర్టిఫికెట్ల సత్వర జారీ కోసం కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక సహాయ కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

వైకుంఠ ఏకాదశి వేడుకల్లో నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి బాలాజీ మందిరంలో పూజలు చేసిన టీజీఐఐసీ చైర్‌పర్సన్



సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని బాలాజీ మందిరంలో వైకుంఠ ఏకాదశి వేడుకల్లో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



ఉత్తర ద్వారం నుంచి స్వామిని దర్శించుకున్న నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలో శుక్రవారం జరిగిన వైకుంఠ ఏకాదశి వేడుకల్లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న బాలాజీ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకలకు హాజరైన నిర్మలా జగ్గారెడ్డికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు నాగారాజు, వెంకట్‌రాజు, కాంగ్రెస్ నాయకులు ఉదయ్‌భాస్కర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవం వైకుంఠద్వార

దర్శనం

● తెల్లవారుజాము నుంచే ఆలయాలు కిటకిట



మోహినిపురలోని వేంకటేశ్వర ఆలయంలో బారులు దీరిన భక్తులు



పుల్లూరులో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న అర్చకులు



సిద్దిపేటలోని పాత వేంకటేశ్వర ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సప్తద్వారాలు



సిద్దిపేట కల్చరల్/సిద్దిపేట రూరల్/వర్గల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. శుక్రవారం ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని సిద్దిపేటలోని పలు ఆలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. పట్టణంలోని పాత వేంకటేశ్వరాలయం వద్ద ఏర్పాటు చేసిన సప్త ద్వారాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మోహినిపురలోని పద్మావతి సమేత వేంకటేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. కమాన్ వద్ద ఉన్న వేంకటేశ్వర ఆలయాన్ని ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి, న్యాయమూర్తులు స్వాతిరెడ్డి, చందన, శ్రావణి, తరణి స్వామి వారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. ఆర్డీవో సదానందం స్వామి వారిని దర్శించుకున్నారు. మాజీ జడ్పీచైర్‌పర్సన్ రోజారాధాకృష్ణశర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు కుటుంబసమేతంగా స్వామి వారిని ఉత్తర ద్వారా దర్శనం చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ కుటుంబసమేతంగా స్వామి వారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు స్వయం భూ లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవం వైభవంగా జరిగింది. స్వయం భూలక్ష్మీ నరసింహ స్వామిని అందంగా అలంకరించారు. ఉత్సవ విగ్రహాలను ఊరేగించి భక్తులకు దర్శనం కల్పించారు. దేవాలయ వంశపారంపర్య అర్చకులు కలకుంట్ల రంగాచార్య, పొడిచేటి రామకృష్ణ, పొడిచేటి శ్రీనివాసాచారి, కలకుంట్ల వెంకట్, కలకుంట్ల నచికేత, విజయ్ కుమార్ నేతృత్వంలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం, వర్గల్ విద్యాధరి క్షేత్రంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం, వర్గల్ వేణుగోపాలస్వామి ఆలయాలలో ముక్కోటి ఏకాదశి (వైకుంఠ ఏకాదశి) వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు భక్తులు భారీగా తరలివచ్చారు.



విద్యాధరి ఆలయంలో కొలువైన వేంకటేశ్వరస్వామి

పండక్కి ఊరెళ్తున్నారా జాగ్రత్త?

● పోలీసుల సూచనలు పాటించాలి : సీపీ

సిద్దిపేటక్రైం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఇంటికి తాళం వేసి సంక్రాంతి పండుగకు ఊరు వెళ్లేవారు, విహారయాత్రలకు వెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోవాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ సూచించారు. సెలవుల్లో సొంత ఊర్లకు వెళ్లేవారికి సలహాలు, సూచనలు అందజేశారు.

- ట్రావెల్స్ ప్లాన్‌ను సోషల్‌మీడియాలో పెట్టకూడదు.
- ఇంట్లో సీసీ కెమెరాలను అమర్చుకోవాలి.
- ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి
- ఊరికి వెళ్లేప్పుడు బంగారం, వెండి ఆభరణాలు, డబ్బు బ్యాంకు లాకర్లలో దాచుకోవడం ఉత్తమం. బీరువా తాళాలను తీసుకెళ్లాలి.
- తప్పనిసరి ఊరు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి.
- పెద్దపెద్ద భవనాల వద్ద సెక్యూరిటీని ఏర్పాటు చేసుకోవడం మంచిది.
- ఇంట్లో ఏదో ఒకరూంలో లైట్ వేసి ఉంచాలి. పక్కింటి వారికి చెప్పి వెళ్లడం ఉత్తమం.
- ఇంటి ఎదుట చెత్త, పాలప్యాకెట్లు, న్యూస్ పేపర్లు జమకాకుండా చూసుకోవాలి.
- ఏదైనా సమస్య వస్తే డయల్ 100కు లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ 8712667100 ఫోన్ చేయాలి.



క్యూఆర్ కోడ్ వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీపీ

ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో క్యూఆర్‌కోడ్

● పోలీసుల పనితీరు తెలుసుకునేలా ప్రత్యేక కోడ్

● బాధితులు స్కాన్ చేసి ఫిర్యాదు చేసేలా వెసులుబాటు

● జిల్లాలో ప్రారంభించిన సీపీ అనురాధ



సిద్దిపేట క్రైం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు పోలీసుల నుంచి మెరుగైన సేవలు అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినప్పుడు వారి పట్ల పోలీసులు ఏ విధంగా ప్రవర్తిస్తున్నారో తెలుసుకోవడానికి క్యూఆర్‌కోడ్‌ను రూపొందించారు. రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు జిల్లాలో సీపీ అనురాధ ఈ క్యూఆర్ కోడ్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఈ క్యూఆర్ కోడ్ ద్వారా ఫిర్యాదులు, ఎఫ్ఐఆర్, ఈ చాలన్ ట్రాఫిక్ ఉల్లంఘనలు, పాస్‌పోర్టు ధ్రువీకరణ, ఇతర అంశములను స్కాన్ చేసి అభిప్రాయాలు తెలియజేయవచ్చన్నారు. రేటింగ్ ఇచ్చే అవకాశం కూడా ఉంటుందని చెప్పారు.

జిల్లాలో ఉన్న ప్రతి పోలీస్ స్టేషన్‌లో క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. పోలీస్‌స్టేషన్‌తో పాటు సర్కిల్ కార్యాలయాలు, ఏసీపీ ఆఫీసులో, కమిషనర్ కార్యాలయంలో కూడా క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేశారు.

డేంజర్ మాంజా

● చైనా మాంజా వాడితే ప్రాణాలకే ముప్పు

● విస్తృతంగా పోలీసుల తనిఖీలు

● జిల్లా వ్యాప్తంగా రూ.3,50,000 విలువ చేసే మాంజా సీజ్

● అవగాహన కల్పిస్తున్న నిపుణులు



సిద్దిపేటలోని ఓ దుకాణంలో పతంగులను కొనుగోలు చేస్తున్న చిన్నారులు

సిద్దిపేట క్రైం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : నేటి నుంచి విద్యార్థులకు సంక్రాంతి సెలవులు ప్రారంభమయ్యాయి. ఈ సెలవుల్లో విద్యార్థులు పతంగులను ఎగురవేస్తూ ఆనందంగా గడుపుతారు. అయితే ఈ పతంగులను ఎగురవేయడానికి ఎక్కువమంది చైనా మాంజాను ఉపయోగిస్తుంటారు. ఈ మాంజా రకరకాల రసాయనాలతో, హానికరమైన రంగులు, గాజుపిండితో తయారవుతున్నందున ఈ మాంజాను వినియోగించకూడదని కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. ఈ చైనా మాంజాను అమ్మినా, రవాణా చేసినా వ్యాపారులపై చట్టప్రకారం.. చర్యలు తీసుకుని జరిమానాతో పాటు జైలుశిక్ష పడేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ముప్పు అంటున్నా..

చైనా మాంజా ఉపయోగించడం వల్ల ఆకాశంలో ఎగిరే పక్షులకు, భూమి మీద తిరిగే జంతువులతో పాటు మానవులకు కూడా ముప్పు వాటిల్లుతుందని, అందుకే ఈ చైనా మాంజాను వాడకూడదని జిల్లాలో పలువురు నిపుణులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. కొన్ని ప్రైవేట్ పాఠశాల యజమాన్యాలు, విద్యార్థులు ఫ్లకార్డులతో ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాలో చైనా మాంజాతో పిల్లల చేతులు తెగిన సంఘటనలు చాలానే ఉన్నాయి. రోడ్డుపైన వెళ్లే వాహనదారుల గొంతుకు తగిలి ప్రమాదాల బారిన పడిన వారు కూడా ఉన్నారు. ఈ సంఘటనలను గుర్తుచేస్తూ ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించి చైనామాంజాను నివారించడానికి, అధికారులు నిపుణులు కృషి చేస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా తనిఖీలు

ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజాను విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సిద్దిపేట పోలీసులు జిల్లావ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేపట్టారు. నైలాన్, సింథటిక్ దారాలతో తయారు చేసే చైనా మాంజాలతో ప్రమాదకరమని తెలియజేస్తున్నారు. చైనా మాంజాను ఎవరైనా విక్రయించినట్లు సమాచారం ఉంటే వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచిస్తున్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో, గజ్వేల్‌లో పోలీసులు పతంగుల దుకాణాలలో తనిఖీలు నిర్వహించి మొత్తం రూ.3,50,000 విలువ చేసే చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నారు.

మారని వ్యాపారస్తుల తీరు

ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజాను వాడకూడదని ప్రభుత్వ అధికారులు, పోలీసులు చెబుతున్నప్పటికీ వ్యాపారులు మాత్రం ఏంమాత్రం పట్టనట్టుగా వ్యవహరిస్తూ రహస్యంగా అమ్ముతున్నట్లు తెలుస్తుంది. పోలీసులు తనిఖీలు చేసినప్పుడు దుకాణాలో చైనా మాంజ ఉంచకుండా జాగ్రత్తలు తీసుకొని, పోలీసులు

మిగతా 8వ పేజీలో...

నేను హరీశ్‌రావును

మాట్లాడుతున్నా..

● పదో తరగతి విద్యార్థులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఫోన్

● పరీక్షలు దగ్గర పడుతున్నందున బాగా చదివించాలని సూచన



సిద్దిపేట కల్చరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): "మొగిలయ్య.. బాగున్నవా.. అక్షిత బాగా చదువుకుంటుందా..? ఎట్లున్నవ్ యాదగిరి..? నంద కిషోర్ ఎట్లా చదువుతున్నడు..? అనూష బాగా చదువుతుందా...? టీవీ బంజేస్తున్నారా లేదా? జర పొద్దుగాల లేపి నీళ్లతో మొహం కడిగిపిచ్చి చదివించండి. రెండు, మూడు నెలలు టీవీలు, సీరియల్ బంద్ చేసి పిల్లలను చదివించండి. నేను రాసిన ఉత్తరం అందిందా..?" అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పదోతరగతి విద్యార్థులకు స్వయంగా ఫోన్ చేసి బాగోగులు కనుక్కున్నారు. అన్నింటిలో ముందుండే సిద్దిపేటను పదోతరగతి ఫలితాల్లో కూడా ముందుంచాలని సూచించారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులుంటాయని, తన సొంత ఖర్చులతో స్నాక్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధిగా, మీ కుటుంబంలో ఒకడిగా తన వంతు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. మీరు కూడా శ్రద్ధతో పిల్లలను చదివించాలని సూచించారు. అలాగే సిద్దిపేట నియోజకవర్గంలోని పదోతరగతి విద్యార్థుల ప్రిపరేషన్‌పై జిల్లా విద్యాధికారులు, మండల విద్యాధికారులు, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆయన దిశానిర్ధేశం చేశారు. ఏ సబ్జెక్ట్‌లో ఏ విద్యార్థి వెనుకబడి ఉన్నాడో తెలుసుకుని స్పెషల్ కేర్ తీసుకోవాలని చెప్పారు. త్వరలోనే పాఠశాల వారిగా ఒక సమీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు.



సంక్రాంతి సందడి

సిద్దిపేటలో సంక్రాంతి సందడి మొదలైంది. స్కూళ్లకు సెలవులు ఇవ్వడంతో కొందరు తమ పిల్లలతో కలిసి సొంత ఊళ్లకు వెళ్లడానికి సిద్ధమయ్యారు. సిద్దిపేట బస్టాండ్ రద్దీగా మారింది. సీట్ల కోసం జనాలు తోపులాడుకున్నారు. పట్టణంలోని వస్త్రదుకాణాలు కిటకిటలాడాయి. మార్కెట్‌లో వివిధ రంగు రంగుల పతంగులు అందుబాటులోకి వచ్చాయి. పతంగులు కొనుగోలు చేయడానికి పిల్లలు ఆసక్తి చూపించారు.

- సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జనవరి 10



క్రైం కార్నర్

చావులోనూ వీడని స్నేహబంధం

- ఇద్దరు మిత్రులను లారీ రూపంలో కబలించిన మృత్యువు
- బైక్‌ను ఢీకొన్న లారీ.. ఇద్దరి మృతి




దుర్గాప్రసాద్, నాగరాజు(ఫైల్)

నర్సాపూర్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఆ ఇద్దరు చిన్నప్పటి నుంచి కలిసి చదువుకున్నారు.. పెద్దయ్యాక కూడా ఇద్దరు ఒకేదగ్గర పనిచేయగా.. ఏపని ఉన్న ఇద్దరు కలిసే వెళ్లేవారు.. అలాంటి స్నేహితులను లారీ రూపంలో వచ్చిన మృత్యువు బలిగొన్న విషాదకర ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకున్నది. పోలీసులు, గ్రామస్థుల వివరాల ప్రకారం.. అల్లీపూర్ గ్రామానికి చెందిన కమ్మరి దుర్గాప్రసాద్(26), పిట్ల నాగరాజు(25) ఇద్దరు ఇంటర్ వరకు కలిసే చదువుకున్నారు. ఇద్దరూ ఓ ఫౌల్ట్రీ కంపెనీలో సూపర్‌వైజర్లుగా పనిచేస్తూ జీవనం సాగించారు. ఏడాది క్రితం దుర్గాప్రసాద్ మరో చోట ఉద్యోగం చూసుకుని పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం నాగరాజు పౌల్ట్రీఫాం సీడ్ కోసం హైదరాబాద్ శివారులోని కొంపల్లికి వెళ్లాల్సి రావడంతో దుర్గాప్రసాద్‌ను తీసుకుని బైక్‌పై ఉదయం వెళ్లారు. తిరిగి అక్కడి నుంచి వస్తున్న క్రమంలో మరో పది నిమిషాలైతే ఇంటికి చేరుతామని అనుకునేలోపే హైదరాబాద్ వైపు నుంచి వేగంగా వచ్చిన లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ బైక్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొన్నాడు. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరు రోడ్డుపై పడగా.. దుర్గాప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రగాయాలైన నాగరాజును ఆసుపత్రికి తరలించేలోపే మరణించాడు. చిన్ననాటి నుంచి మిత్రులైన వారు చివరకు చావులోనూ కలిసేవెళ్లిపోవడం అందరినీ కలచి వేసింది. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. దుర్గాప్రసాద్‌కు భార్య సారికతో పాటు ఓ కూతురు ఉంది. నాగరాజుకు భార్య మేఘమాలతో పాటు ఓ కూతురు ఉన్నది. కాగా, లారీ డ్రైవర్ బైకును ఢీకొట్టి అలాగే వెళ్తుండగా గమనించిన స్థానికులు వెంబడించి లారీని పట్టుకుని డ్రైవర్‌ను పోలీసులకు అప్పగించారు. పోలీసులు లారీని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పెళ్లికి పెద్దలు అంగీకరించలేదని..

ప్రేమజంట ఆత్మహత్య

సింగూరు ప్రాజెక్టు సమీపంలోని హరిత రెస్టారెంట్‌లో ఘటన




ఉదయ్‌కుమార్, రోహిత(ఫైల్)

మునిపల్లి/నారాయణఖేడ్, జనవరి10 (ఆంధ్రజ్యోతి): తమ పెళ్లికి పెద్దలు అంగీకరించలేదని ఓ ప్రేమజంట ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం బుసారెడ్డిపల్లి శివారు సింగూరు ప్రాజెక్టు సమీపంలోని హరిత రెస్టారెంట్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నిజాంపేట మండల కేంద్రానికి చెందిన కార్వే ఉదయ్‌కుమార్(24) మిర్చి వ్యాపారం చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన మంగలి రోహిత(20) డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. వీరు ఏడాదిన్నర నుంచి ప్రేమించుకుంటున్నారు. విషయం ఇరు కుటుంబాలకు తెలియడంతో పెద్దలు ఏడాది క్రితం పంచాయితీ నిర్వహించారు. ఇద్దరూ కలుసుకోకూడదని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇటీవల మళ్లీ వారి కుటుంబాల మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. దీంతో ఎప్పటికైనా తమ ప్రేమను, పెళ్లిని ఇరు కుటుంబాల వారు ఒప్పుకోరేమోనని భావించారు. గురువారం రాత్రి ఇద్దరూ కలిసి బుసారెడ్డిపల్లి శివారులోని సింగూరు ప్రాజెక్టు సమీపంలోని హరిత రెస్టారెంట్‌కు వచ్చి గదిని అద్దెకు తీసుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున రెస్టారెంట్ సిబ్బంది చూడగా, ఇద్దరూ ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించారు. వెంటనే మునిపల్లి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రాజేష్‌కుమార్, ఏఎస్‌ఐ ఏసయ్యలు వచ్చి పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్య చేసుకున్న ఉదయ్‌కుమార్ తండ్రి రోడ్డు ప్రమాదంలో చనిపోగా, తల్లి, సోదరుడు, సోదరి ఉన్నారు. డిగ్రీ చదువుతున్న రోహిత బుధవారం తరగతులకు హాజరైంది. గురువారం కళాశాలకు రాలేదు. కుమార్తె ఇంటికి రాకపోవడంతో తండ్రి శుక్రవారం ఉదయం కళాశాలకు ఫోన్ చేసి ఆరా తీసినట్లు తెలిసింది.

ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొన్న లారీ

భర్త మృతి, భార్యకు గాయాలు

కొండపాక, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : బైక్‌ను లారీ ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా, మరొకరికి గాయాలైన సంఘటన కొండపాక మండలం దుద్దెడ శివారులో కలెక్టరేట్ సమీపంలో రాజీవ్‌రహదారిపై శుక్రవారం చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. కోహెడ మండలం తంగళ్లపల్లి గ్రామానికి చెందిన ఎర్రవెల్లి బాలకిష్టయ్య(59) తన భార్య రేణుకతో కలిసి పని నిమిత్తం హోండా యాక్టివాపై స్వగ్రామం నుంచి సిద్దిపేట కలెక్టరేట్‌కు వస్తున్నారు. సిద్దిపేట నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ అతివేగంగా అ జాగ్రత్తగా వస్తూ కలెక్టరేట్ ఎదుట వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టి.. బాలకిష్టయ్య పైనుంచి వెళ్లింది. తీవ్ర గాయాలపాలైన బాలకిష్టయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన భార్య రేణుకకు గాయాలయ్యాయి. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

మాసాయిపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వృద్ధురాలు మృతిచెందిన సంఘటన మాసాయిపేట పరిధిలో శుక్రవారం చోటుచేసుకున్నది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. హకీంపేటకు చెందిన పత్తి కిష్టమ్మ(85) శుక్రవారం చందాయిపేటలోని తన కూతురు వద్దకు బయలుదేరింది. మాసాయిపేటకు చేరుకుని చందాయిపేట చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడింది. స్థానికులు 108 అంబులెన్స్ సమాచారం అందించి, అందులో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వెలిమెలలో ఎలాంటి భూ కుంభకోణం జరగలేదు

- కొందరు తమ స్వప్రయోజనాలకు దుష్ప్రచారం
- గ్రీన్‌మార్క్ డెవలపర్స్ న్యాయవాదులు

సంగారెడ్డి రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం మండలంలోని వెలిమెలలో ఎలాంటి భూ కుంభకోణం జరగలేదని గ్రీన్‌మార్క్ డెవలపర్స్ న్యాయవాదులు వేణుమాధవరావు, రంగారెడ్డి, ఎర్రంరెడ్డి, శ్రీనివాస ప్రసాద్‌లు తెలిపారు. సంగారెడ్డిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వెలిమెల శివారులో భూ కుంభకోణం జరిగిందంటూ చేస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. ఆ గ్రామానికి చెందిన మహిపాల్‌గౌడ్ అనే వ్యక్తి తన స్వప్రయోజనాల కోసం కొంత మంది అనుచరులతో కలిసి తమపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారని తెలిపారు. 85 ఎకరాల భూమిని ఆక్రమించుకున్నట్టు ప్రచారం చేస్తున్నారని అన్నారు. రామచంద్రాపురం మండలం వెలిమెల, రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం కొండకల్ గ్రామాల సరిహద్దుల్లో భూములను తమ సంస్థ ద్వారా కొనుగోలు చేసిన మాట వాస్తవేమనన్నారు. అయితే మహిపాల్ గౌడ్ అనే వ్యక్తి చెరువులు, ప్రభుత్వ భూములు కబ్జా చేసినట్టు గతంలో తహసీల్దార్ ఫిర్యాదు చేసినట్టు వెల్లడించారు. అలాంటి వ్యక్తి తమపై ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు. తమపై ఎలాంటి నిరాధారమైన ఆరోపణలు చేస్తే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఈ రెండు గ్రామాల మధ్య ఉన్న సరిహద్దుల వివాదాన్ని పరిష్కరించేందుకు అధికారులు పారదర్శకంగా సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేశారన్నారు. అయితే కొందరు తమ సంస్థ పట్ల అధికంగా భూమి ఉన్నదని చెడు ప్రచారం చేయడం సరికాదన్నారు. వెలిమెల శివారులో బిలాదాఖలు లేదని రెవెన్యూ అధికారులు నిర్ధారించినప్పటికీ కొంతమంది తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు.





హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్ పోటీలో ఉమ్మడి మెదక్ జిల్లా తరఫున ముగ్గు వేస్తున్న యామిని, పోటీలో పాల్గొన్న మహిళలతో సినీనటి వైష్ణవీ చైతన్య



ముగ్గు వేస్తున్న సినీనటి వైష్ణవీ చైతన్య



ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ రాష్ట్ర స్థాయి ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్స్



ముగ్గు వేస్తున్న మహిళ

"ముత్యాల ముగ్గులు నేలమ్మను పలకరించాయి. చుక్కలతో వేసిన రంగ వల్లుల మధ్య గొబ్బెమ్మలు.. చెరుకుగడలు.. పిండివంటల అలంకరణలతో సంక్రాంతి శోభను ముందే తెచ్చాయి. ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) తెలంగాణ రాష్ట్ర స్థాయి ఫైనల్స్ పోటీలు హైదరాబాద్‌లోని సనత్‌నగర్ జీహెచ్ఎంసీ మున్సిపల్ గ్రౌండ్‌లో ఉల్లాసంగా.. ఉత్సాహంగా శుక్రవారం జరిగాయి. విజేతలకు ముఖ్య అతిథులు సినీనటి వైష్ణవీచైతన్య, సినీనటుడు వడ్లమాని సాయి శ్రీనివాస్ బహుమతులను అందజేశారు."



పోటీలో రంగవల్లులు వేస్తున్న మహిళలు



బహుమతుల ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న సినీ నటుడు వడ్లమాని సాయి శ్రీనివాస్, చిత్రంలో న్యాయ నిర్ణేతలు పి. రజని, డాక్టర్ పి. శ్రీలక్ష్మి, నటి వైష్ణవీ చైతన్య, సంతూర్ హైదరాబాద్ ఏరియా మేనేజర్ సంజీవ్ మోదీ, ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్

ఆటో ట్రాలీ వెనుక చక్రం కింద పడి కార్మికురాలు మృతి

గుమ్మడిదల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఓ ఫ్యాక్టరీలో ఆటో ట్రాలీ వాహనం వెనుక టైర్ కింద పడి కార్మికురాలు మృతిచెందిన సంఘటన గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. దోమడుగు గ్రామానికి చెందిన మంత్రి భాగ్య(35) గ్రామ పరిధిలో ఉన్న పారిశ్రామికవాడలోని ప్రగతిపాలీమర్ పరిశ్రమలో కార్మికురాలిగా పనిచేస్తున్నది. రోజులాగే శుక్రవారం పరిశ్రమకు విధులకు వెళ్లింది. ఫ్యాక్టరీలోని ఆటో ట్రాలీ రివర్స్ వస్తుండగా గమనించకపోవడంతో భాగ్య వాహనం వెనుక టైర్ కింద పడి అక్కడికి అక్కడే మృతిచెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య



నర్సింహులు(ఫైల్)

నంగునూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట జిల్లా రాజగోపాలపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకున్నది. ఎస్ఐ ఆసిఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. నంగునూరు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ జంగిటి నర్సింహులు(36) తన ఇంటి నిర్మాణం కోసం రెండేళ్ల క్రితం రూ.5 లక్షల అప్పు చేశాడు. ఆటో సరిగ్గా నడవకపోవడంతో అప్పు తీర్చే మార్గం కనపడక మనోవేదనకు గురై తన ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని చనిపోయాడు. నర్సింహులు భార్య భవానీ ఫిర్యాదు మీరు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థిగా అంజిరెడ్డి

సంగారెడ్డి అర్బన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి) : నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థిగా సి.అంజిరెడ్డిని ఎంపిక చేస్తూ ఆ పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురానికి చెందిన చిన్నమైల్ అంజిరెడ్డి 1966 జూన్ 18న హైదరాబాద్‌లో జన్మించారు. ఓసీ (రెడ్డి) సామాజికవర్గానికి చెందిన ఆయన డిగ్రీలో బీఏ మ్యాథ్స్ పూర్తి చేశారు. రెండు దశాబ్దాలుగా ఎస్ఆర్ ట్రస్టు ద్వారా సేవలందిస్తున్నారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త, బీజేపీ రాష్ట్ర నాయకులుగా సుపరిచితులు. 2014లో పటాన్‌చెరు నుంచి ఎమ్మెల్యేగా ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2024 మెదక్ ఎంపీ సీటును ఆశించారు. ఆయన సతీమణి గోదావరి ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలుగా కొనసాగుతున్నారు. కాగా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించినందుకుగాను కేంద్ర, రాష్ట్ర నాయకత్వానికి అంజిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

న్యాల్‌కల్‌లో 9.9 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత

కోహీర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలో శుక్రవారం 9.9 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. వారం రోజులుగా ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా గురువారం రాత్రి, శుక్రవారం ఉదయం కాస్త మెరుగుపడినప్పటికీ చలి తీవ్రత మాత్రం తగ్గడం లేదు. రాత్రైతే గజగజ వణికిపోతున్నారు. మధ్యాహ్నం కూడా చల్లని ఈదురుగాలలతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.





గీతంలో సంక్రాంతి సంబురం

పటాన్‌చెరు రుద్రారంలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం సంక్రాంతి ఉత్సవాలను ఆతిథ్య విభాగం, స్టూడెంట్ లైఫ్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఎడ్ల బండి, సహజ పద్ధతిలో చెరుకు రసం వెలికితీత పరికరం ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ముగ్గుల పోటీని నిర్వహించగా, యువతీయువకులు గాలిపటాలతో సందడి చేశారు.

- పటాన్‌చెరు రూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి)



పడవ పోటీలో విద్యార్థులు

బీవీఆర్‌ఐటీలో ముగిసిన పడవ పందేలు

నర్సాపూర్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్‌ఐటీ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో కాంక్రీట్ కానో ఈవెంట్ హంగామాగా కొనసాగింది. చివరిరోజైన శుక్రవారం కాలేజీలోని నీటి కుంటలో పడవ పోటీలను నిర్వహించగా విద్యార్థులు స్వయంగా తయారు చేసిన పడవను నడిపి తమ ప్రతిభను చాటారు. ఈ పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ఆయా కాలేజీల నుంచి 16 బృందాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా కాలేజీ వైస్‌చైర్మన్ రవిచంద్రన్ మాట్లాడుతూ టెక్నాలజీకి అనుగుణంగా తమ నైపుణ్యాన్ని పెంచుకోవడానికి ఈ పోటీలు దోహదపడుతాయన్నారు. ఈ పోటీల్లో బీవీఆర్‌ఐటీ సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు మొదటి బహుమతి, బాసర రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ కళాశాల రెండవ బహుమతి, విష్ణు కాలేజీ భీమవరం(ఆంధ్రప్రదేశ్)కు చెందిన వారు మూడవ బహుమతిని గెలుపొందారు. ఈ కార్యక్రమంలో బీవీఆర్‌ఐటీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, హెచ్‌వోడీ కృష్ణారావు, డీజీఎం కాంతారావు, మేనేజర్లు బాపిరాజు, అశోక్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చేర్యాల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ మరమ్మతుల కారణంగా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ జె.మధు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్ పరిధిలోని గురువన్నపేట, పోసాన్‌పల్లి, తపాస్‌పల్లి, ఐనాపూర్ గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ప్రభుత్వాసుపత్రి వైద్య సేవలు

- జిల్లా ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్

గజ్వేల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ప్రభుత్వాసుపత్రి వైద్య సేవలు ఉన్నాయని గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ అన్నపూర్ణ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రిలో కంటి వైద్యం, ఎముకల ఆపరేషన్లు, చిన్నపిల్లల వైద్య సేవలు, ప్రతి శుక్రవారం స్త్రీ నిపుణుల వైద్య సేవలు(ఎన్‌సీడీసీ) క్లినిక్ నిర్వహించబడుతుందని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. వెంట వైద్యులు డాక్టర్ సాయి కిరణ్, డాక్టర్ మంజుల ఉన్నారు.

చేర్యాల ప్రాంత ప్రజలకు..

ఇక ఆ ఇబ్బందులు తప్పినట్టే!





చేర్యాల కోర్టు భవనం, కోర్టు హాలులో సంసిద్ధం చేసిన ఫర్నిచర్

- అందుబాటులోకి మున్సిఫ్‌కోర్టు సేవలు
- నేడు ప్రారంభించనున్న హైకోర్టు జడ్జి బి.విజయ్‌సేన్‌రెడ్డి
- ప్రస్తుతానికి వారంలో ఒక రోజు
- ఇటీవల 27 పోస్టులు మంజూరు

చేర్యాల, జనవరి 10(ఆంధ్రజ్యోతి): చేర్యాల ప్రాంత ప్రజలు ఇక నుంచి స్థానికంగానే కోర్టు సేవలు పొందబోతున్నారు. చేర్యాలలో ఫస్ట్ క్లాస్ జూనియర్ సివిల్ జడ్జి ఈ నెల 11న కోర్టును ప్రారంభించనుండటం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంతోకాలంగా చేర్యాల, మద్దూరు, ధూళిమిట్ట, కొమురవెల్లి మండలాల ప్రజలు వివాదాలు, తగాదాలు, నేరాలు, ప్రమాదాలు తదితర కేసులకు సంబంధించి ఇతర ప్రాంతాల్లోని కోర్టులకు వెళ్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక నుంచి ఈ ప్రాంత ప్రజలకు కోర్టు సేవల కోసం ఎదురవుతున్న వ్యయ, ప్రయాసలు తప్పనున్నాయి.

గతంలో కోర్టు సేవల కోసం..

గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లా సరిహద్దులో ఉన్న ఉమ్మడి చేర్యాల, మద్దూరు మండలాల ప్రజలు జనగామ జూనియర్, సబ్ కోర్టులకు, జిల్లాకోర్టు కోసం వరంగల్‌కు వెళ్లేవారు. క్రమంగా జనగామలోనే సేవలు పొందుతున్న సమయంలో జిల్లాల పునర్విభజన కారణంగా రెండు ఉమ్మడి మండలాలు సిద్దిపేట జిల్లాలో విలీనం చేశారు. దీంతో చేర్యాల, కొమురవెల్లి మండలాలు సిద్దిపేట డివిజన్, మద్దూరు, ధూళిమిట్ట మండలాలు హుస్నాబాద్ డివిజన్ పరిధిలో విలీనం చేశారు. దీంతో ఆయా డివిజన్ల ఆధారంగా నాలుగు మండలాల ప్రజలు జూనియర్, సబ్, జిల్లా కోర్టులకు వెళ్తున్నారు. కానీ మద్దూరు, ధూళిమిట్ట మండలాల ప్రజలు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు హుస్నాబాద్‌కు, సబ్, జిల్లా కోర్టుకు సిద్దిపేటకు వెళ్లాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నారు.

రెండేళ్ల క్రితమే మంజూరైనా..

సుమారు రెండేళ్ల క్రితం బీఆర్‌ఎస్ ప్రభుత్వం జిల్లా కోర్టులను ఏర్పాటు చేసిన క్రమంలో చేర్యాలకు కూడా మున్సిఫ్ కోర్టును మంజూరు చేసింది. అయితే సొంత భవనం లేకపోవడంతో ఎంపీడీవో కార్యాలయ భవనాన్ని ప్రతిపాదించగా ఆమోదం పొందింది. తదనంతరం ప్రత్యామ్నాయ ప్రక్రియ చేపట్టడంలో జాప్యం జరిగింది. అసెంబ్లీ ఎన్నికల కోడ్ వల్ల పోస్టులు మంజూరుకు నోచుకోలేదు. ఈ విషయమై జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చొరవ చూపి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖతో పాటు న్యాయశాఖ ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపారు. దీంతో కొద్దిరోజులక్రితం 27పోస్టులను మంజూరు చేశారు. వీరిలో జూనియర్ సివిల్ జడ్జి, సూపరింటెండెంట్, హెడ్ క్లర్క్, సీనియర్ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్, జూనియర్ అసిస్టెంట్-7, టైపిస్ట్-2, ఫీల్డ్ అసిస్టెంట్-3, ఎగ్జామినర్-1, కాపీయిస్ట్-1, ప్రాసెస్ సర్వర్-3, రికార్డు అసిస్టెంట్-1, ఆఫీస్ సబార్డినేట్-5రు చొప్పున పోస్టులు మంజూరు చేశారు. దీంతో ఇక కోర్టు భవనం ప్రారంభమే తరువాయిగా మారినప్పటికీ ఆయా పోస్టులను భర్తీ చేయడంలో కొంతసమయం పట్టనుండటంతో ఆటంకం కలగకుండా ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్నారు.

ఇప్పటికైతే వారంలో ఒక రోజు సేవలు

ప్రస్తుతానికి వారంలో ఒకరోజు కోర్టు సేవలు అందించేందుకు కార్యాచరణ రూపొందించారు. సిద్దిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జికి అదనపు బాధ్యతలు అప్పగించడంతో పాటు రోజువారీ కార్యకలాపాలు కొనసాగించేందుకు పలువురిని డిప్యూటేషన్‌పై నియమించారు. క్రమంగా పోస్టుల భర్తీని బట్టి వారం రోజులకు సేవలను పొడిగిస్తారు. త్వరలో చేర్యాలకు న్యాయమూర్తి నియామకం కానున్నారు. ప్రస్తుతం నాలుగుమండలాలకు సంబంధించి 2వేలకు పైగా కేసులు ఉన్నట్లు సమాచారం.

విద్యాసంస్థల్లో ముందస్తు పండుగ సంబురాలు



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగ్గులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ సునీత



చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



కోహెడ: హరిదాసు వేషధారణతో చిన్నారులు

న్యూస్‌నెట్‌వర్క్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థలకు సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో శుక్రవారం జిల్లాలోని ఆయా విద్యాసంస్థల్లో ముందస్తు పండుగ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అదేవిధంగా భోగిమంటలు, హరిదాసువేషధారణతో ఆయా పాఠశాలల ఆవరణలో చిన్నారులు సందడి చేశారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలుగు శాఖ నవకల్పన కార్యక్రమాల్లో భాగంగా ఏకో ఫ్రెండ్లీ ధ్యేయంతో రంగులు రసాయనాలు లేకుండా శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. కేవలం సుద్దను ఉపయోగించి అందంగా వేసిన ముగ్గులను సెలక్ట్ చేసి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. చేర్యాల మండలంలోని ఆయా గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛత ముగ్గుల పోటీలు నిర్వహించారు. చిన్నకోడూరు మండలంలో విద్యార్థినులు ముగ్గులు వేశారు. విద్యార్థులు గాలి పటాలు ఎగరవేసి సందడి చేశారు. ఆటపాటలతో భోగి మంటలు కాశారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని నంగునూరు జూనియర్ కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గజ్వేల్ మండలంలోని సింగాటం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులు ముగ్గులు వేస్తూ, గాలిపటాలు ఎగురవేసి సందడి చేశారు. కొండపాక మండలంలోని దమ్మక్కపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అలాగే మర్కుక్, రాయపోల్, మద్దూరు, కోహెడ మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతుల ప్రదానం చేశారు.



రాయపోల్:వడ్డేపల్లి పాఠశాలలో పాలను పొంగిస్తున్న విద్యార్థులు

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి



రెండుమండలాల విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చాటేందుకు పార్టీశ్రేణులు సన్నద్ధమవ్వాలని, నియోజకవర్గం మొత్తంగా గులాబీజెండా రెపరెపలాడేందుకు సమన్వయంతో పాటుపడాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. చేర్యాల, కొమురవెల్లి మండలాల బీఆర్‌ఎస్ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో శుక్రవారం స్థానిక రేణుకాగార్డెన్స్‌లో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో అన్నీ వైఫల్యాలే ఉన్నాయని, ఎన్నికలముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలుచేయలేదన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ప్రతీ ఇంటికి చేకూరిన ప్రయోజనంతో పాటు కాంగ్రెస్ పాలనలో జరిగిన నష్టాన్ని ప్రజలకు వివరించాలన్నారు. బీఆర్‌ఎస్ సంస్థాగత బలోపేతంగా ఉందని, అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కాగా ఉపాధి కరువై కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామానికి చెందిన తలారి బాలనర్సు, అదే గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు చింతల ఉప్పలయ్య మరణించగా వారి కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శించారు.

ఊరికి వెళ్లేవారు పోలీసులకు సమాచారమివ్వాలి

వర్గల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లేవారు పోలీసుల సూచనలు పాటించాలని గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఊరికి వెళ్లే వారు ఇంటికి తాళం వేసినప్పుడు ఇంట్లో విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో లేదా ఇంట్లో రహస్య ప్రదేశాల్లో దాచుకోవాలన్నారు. తాళం వేసి ఊరికి వెళ్లవలసి వస్తే పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

జగదేవ్‌పూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పశు ఆరోగ్య చికిత్సల కోసం ఏర్పాటు చేసే వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కొండల్‌రెడ్డి అన్నారు. మండలంలోని అలిరాజ్‌పేటలో పశు గణాభివృద్ధి సంస్థ, పశువైద్య, సంవర్ధకశాఖ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు, 6 గర్భకోశ వ్యాధిచికిత్స, 25 పశువులకు సాధారణ చికిత్సలు, 18 దూడలకు నట్టల మందు పంపిణీ చేశారు. 32 పశువులకు గాలికుంటు, 42 తెల్ల పశువులకు ముద్ద చర్మవ్యాధి టీకాలను వేసినట్లు తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలి



చిన్నకోడూరు: సమావేశంలో మాట్లాడుతున్న బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఉమ్మడి మెదక్ జిల్లా అబ్జర్వర్ కిషన్

చిన్నకోడూరు/చేర్యాల/ములుగు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : రాబోయే వార్షిక పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా అధ్యాపకులు ప్రణాళికబద్ధంగా కృషి చేయాలని బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఉమ్మడి మెదక్ జిల్లా అబ్జర్వర్ కిషన్ సూచించారు. చిన్నకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం ఆయన డీఐఈవో రవీందర్‌రెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. 90 రోజుల పాఠ్య ప్రణాళిక అనుసారంగా తరగతులు నిర్వహిస్తూ పాఠ్యాంశాలు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ లెక్చరర్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, గెజిటెడ్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనక చంద్రం, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే చేర్యాల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను, ములుగు మండలకేంద్రంలోని ప్రభుత్వ కళాశాలను డీఐఈవో రవీందర్‌రెడ్డితో కలిసి స్టేట్ అబ్జర్వర్ కిషన్ శుక్రవారం సందర్శించి విద్యార్థుల చదువుపై ఆరా తీశారు. ఈసందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు. విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రుల కలను నెరవేర్చాలని కోరారు విద్యార్థులు బాగా చదువుకొని పరీక్షలకు సిద్ధం కావాలన్నారు.

డేంజర్ మాంజా

(5వ పేజీ తరువాయి)

వెళ్లిన తర్వాత మళ్లీ చైనామాంజను అమ్ముతున్నట్లు సమాచారం. ఇకనైనా పోలీసులు ఇలాంటి దుకాణాలపై ప్రత్యేక దృష్టి సాధించి పూర్తిగా చైనామాంజను నివారించాలని పలువురు కోరుతున్నారు.

చైనామాంజా అమ్మితే చర్యలు: సీపీ అనురాధ

చైనా మాంజాతో పశుపక్ష్యాదులతోపాటు మానవులకు కూడా ముప్పు. పర్యావరణ కాలుష్యం అయ్యే విధంగా వివిధ రకాల రసాయనాలతో తయారవుతున్నందున 2016లో కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. జిల్లాలో విస్తృతంగా తనిఖీలు చేపట్టాం. చైనా మాంజా అమ్మిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయాలు



కోహెడ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఉత్సవమూర్తులు





దుబ్బాక బాలాజీ వేంకటేశ్వరాలయంలో మాధవానందసరస్వతి ప్రత్యేక పూజలు, ఉత్తరద్వారం నుంచి ఆలయంలోకి ప్రవేశిస్తున్న భక్తులు



హుస్నాబాద్‌లోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

న్యూస్‌నెట్‌వర్క్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని వైష్ణవాలయాలకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయాలు గోవిందనామస్మరణతో మార్మోగాయి. ఆయా ఆలయాల్లో ఉత్సవ నిర్వాహకులు, ఆలయకమిటీల బాధ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు ఒక రోజు ముందే ఉత్తర ద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేకువ జామునుంచే భక్తులు ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దుబ్బాక పట్టణంలోని శ్రీబాలాజీ వేంకటేశ్వరాలయం వద్దబారీకేడ్లద్వారా బారీగా క్యూలైన్ ఏర్పాటు చేశారు. తెల్లవారుజాము నుంచి ఉత్తరద్వార దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి, దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి నాయకులతో కలిసి వేర్వేరుగా హాజరయ్యారు. దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ గంగరాజులు ప్రత్యేక బందోబస్తును నిర్వహించారు. దుబ్బాక మున్సిపల్ చెల్లాపూర్ గ్రామంలోని మీసాల వేణుగోపాల స్వామి ఆలయంతోపాటు, రాజక్కపేట రామాలయం, దర్మాజీపేట రామాలయం, దుంపలపల్లి వేణుగోపాల స్వామి ఆలయాల్లో ప్రత్యే పూజలు, ఉత్తరద్వార దర్శనాలుజరుపుకున్నారు. మిరుదొడ్డిలోని సీతారామాంజనేయ, వేంకటేశ్వరాలయాలు, మోతే వెంకటేశ్వరాలయం, అక్బర్‌పేట-భూంపల్లి మండలం కూడవెళ్లి రామలింగేశ్వరాలయం వేణుగోపాలస్వామి ఆలయంల భక్తులు ప్రత్యేక దర్శనాలు చేసుకున్నారు. రాయపోల్ మండలంలోని రాంసాగర్ రామాలయం భక్తులతో కిటకిటలాడింది. కొండపాక ఆనంద నిలయం ఆవరణలో కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఉత్తర ద్వారా దర్శనాన్ని ఉదయం ఐదు గంటలకు ప్రారంభించారు. గజ్వేల్ పట్టణంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరాలయంతో పాటు కొండకండ్ల గ్రామంలోని వేంకటేశ్వరాలయంలో ఉత్తర ద్వార దర్శనాన్ని పెద్ద ఎత్తున భక్తులు బారులు తీరారు. హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో భక్తులు ఉత్తరద్వారం గుండి స్వామివారి దర్శనం చేసుకున్నారు. మద్దూరులో రామాలయం, లద్నూరు చెన్నకేశ్వరస్వామి ఆలయం, ధర్మారంలోని అర్ధనారీశ్వర దేవాలయం, గాగిల్లాపూర్‌లో వెంకటేశ్వర స్వామి ఆలయాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. కోహెడ మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో అర్చక నిర్వహకులు కోహెడ ప్రసాదరావుశర్మ ఆధ్వర్యంలో ధనుర్మాస ప్రత్యేక పూజల్లో భాగంగా తిరుప్పావై పాశుర పఠనం గావించారు. అలాగే శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా రుద్రాభిషేకం పూజలు నిర్వహించారు.

నంగునూరు కోనాయిపల్లి, పాలమాకుల వేంకటేశ్వర ఆలయంతో పాటు నర్మెట్ట శ్రీ సీతారామచంద్ర స్వామి, మైసంపల్లి లక్ష్మి నరసింహ స్వామి తదితర ఆలయాల్లో ఉత్తర ద్వారా దర్శనం కోసం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అలాగే చేర్యాల, కొమురవెల్లి మండలాల్లోని ప్రముఖ వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

వేర్వేరు ఘటనల్లో పురుగుల మందు తాగి..

ఆస్పత్రుల్లో ఇద్దరి మృతి

గజ్వేల్ రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ఘటనల్లో పురుగుల మందు తాగిన ఇద్దరు వ్యక్తులు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఆర్థిక ఇబ్బందులతో ఒకరు, మద్యానికై బానిసై మరొకరు పురుగులమందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. వివరాల్లో వెళ్తే.. గజ్వేల్ మండల పరిధిలోని కొడకండ్ల గ్రామానికి చెందిన ఎంగి కిషన్(22)కు భార్య, కూతురు ఉన్నారు. స్థానికుల వివరాల ప్రకారం.. కిషన్ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ ఈ నెల 8న ఆర్థిక ఇబ్బందులతో తన పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు గజ్వేల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మరో ఘటనకు సంబంధించి గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ మున్సిపాలిటీ పరిదిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(వే ములఘాట్)కు చెందిన సూనూరి నర్సింలు(55)కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. వీరికి మండల పరిధిలోని కొల్గూరులో నివాస గృహముంది. మద్యానికి బానిసైన నర్సింలు మద్యం మత్తులో ఈ నెల 7న కొల్గూరులో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలోకి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాటుసారాను తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితుడు

నంగునూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నాటుసారాను తరలిస్తున్న వ్యక్తిని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యంలో పట్టుకుని అరెస్టు చేశారు. రాజగోపాలపేట ఎస్‌ఐ మహమ్మద్ ఆసిఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. అక్కన్నపేట మండలం మల్‌చెరువు తండాకు చెందిన గుగులోత్ శ్రీను(30) తన మోటార్ సైకిల్‌పై ప్రభుత్వం నిషేధించిన గుడుంబా, నాటు సారా తీసుకుని సిద్దిపేట వైపు వస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు, పోలీసు సిబ్బంది గట్లమల్యాల గ్రామ శివారులో మోటార్‌సైకిల్‌ను ఆపి తనిఖీ చేయగా ప్లాస్టిక్ ప్యాకెట్లలో ఉన్న 10 లీటర్ల నాటుసారాను పట్టుకున్నారు. ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైరు చోరీ

గజ్వేల్ రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కాపర్ వైర్ల చోరీ జరిగిన సంఘటన మండల పరిధిలోని గిరిపల్లిలో చోటుచేసుకుంది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామ సమీపంలోని ఓ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి గురువారం రాత్రి కాపర్ వైర్లను గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. ఈ కాపర్ వైర్ల విలువ రూ. 20వేల వరకు ఉంటుందని విద్యుత్ శాఖ సిబ్బంది పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 21 మందికి జరిమానా

గజ్వేల్ రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 21మందికి గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక రూ. 22,500 వేలు జరిమానా విధించినట్లు గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి తెలిపారు. ఇటీవల గజ్వేల్ పట్టణంలో పిడిచెడ్ రోడ్డుతో పాటు క్యాసారం, తూప్రాన్, ముట్రాజ్‌పల్లి, సంగాపూర్, ఔటర్‌రింగ్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో పోలీసులు వాహనతనిఖీలు నిర్వహిస్తుండగా 21 మంది మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డారు. గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా వారికి జరిమానా విధించినట్లు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ బాధితుడికి అందజేత

వర్గల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా రికవరీ చేసిన గౌరారం పోలీసులు శుక్రవారం బాధితుడికి అప్పగించారు. వర్గల్ మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన సందీప్ అనే వ్యక్తి గౌరారం గ్రామంలో తన వీవో సెల్‌ఫోన్ పోగొట్టుకోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్‌ను రికవరీ చేసిన గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి బాధితుడికి అప్పగించినట్లు తెలిపారు.

ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

సిద్దిపేట అర్బన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ఆర్టీసీ అధికారులపై ఉందని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్దిపేటలో పాత బస్టాండ్ వద్ద మూడు గంటలకు పైగా కరీంనగర్ వెళ్లాల్సిన ప్రయాణికులు బస్సు కోసం ఎదురు చూస్తున్న ఒక బస్సు కూడా రాకపోవడంతో విషయాన్ని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ దృష్టికి తీసుకురాగా ఆర్టీసీ డిపో కంట్రోలర్ దగ్గరికి వెళ్లి సమస్యను వివరించారు. వెంటనే స్పెషల్ బస్సులను వేయించాలని కోరడంతో కరీంనగర్‌కు రెండు బస్సులను ఏర్పాటు చేశారు. బస్సులను ఏర్పాటుకు చొరవ తీసుకున్నందుకు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తూ హరికృష్ణ, అత్తుఇమామ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

మాక్ పోలింగ్‌తో పిల్లల్లో ప్రజాస్వామ్యంపై అవగాహన



రాయపోల్ పాఠశాలలో విద్యార్థుల మాక్ పోలింగ్ కౌంటింగ్‌ను పరిశీలిస్తున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

రాయపోల్/తొగుట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు చదువుతో పాటు సమాజంపై అవగాహన ఎంతో అవసరమని, మాక్ పోలింగ్ నిర్వహించడంతో ప్రజాస్వామ్యంపై అవగాహన పెంపొందుతుందని సిద్దిపేట జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులు పాల్గొని సర్పంచ్, ఉపసర్పంచ్ సభ్యులను ఎన్నుకున్నారు. విద్యార్థులే కౌంటింగ్ నిర్వహించి విజేతలను ప్రకటించారు. అనంతరం గ్రామపంచాయతీలో నిర్వహించిన విధంగానే గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈవో సత్యనారాయణరెడ్డితో కలిసి డీఈవో పరిశీలించారు. తొగుట మండలం వెంకట్రావ్ పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శుక్రవారం సాయంత్రం జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఓటు హక్కుపై ఆయన అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాలలో మాకు పోలింగ్ నిర్వహించారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

గజ్వేల్ రూరల్/కుకునూరుపల్లి/కోహెడ/హుస్నాబాద్ టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లాల్లోని పలు మండలాల్లో విద్యార్థులు, ప్రజలు, డ్రైవర్లకు పోలీసులు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను పాటించి ప్రమాదాల బారిన పడకుండా గమ్యస్థానాలకు సురక్షితంగా చేరాలని గజ్వేల్ ట్రాఫిక్‌ఇన్‌స్పెక్టర్ మురళి, మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ క్రిస్టోఫర్ పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలోని ఇందిరాపార్క్ చౌరస్తాలో వాహనదారులకు, ప్రజలకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో ఎస్‌ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ ప్రజలకు రోడ్డు భద్రతకు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించారు. కోహెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రొబేషనరీ ఎస్‌ఐ సైఫత్ అలీ ట్రాఫిక్ నిబంధనలను వివరించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రుల పై కేసు నమోదు అవుతుందని వివరించారు. హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా పట్టణ ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.